# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY — సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 297 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 9 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME : 10 ISSUE :297 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 09 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# మట్టి గణపతిని పూజిద్దాం

## ఏపీ డిప్యూటీ సీఎం, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్

### త్వరలోనే వినాయకచవితి

### మంగళగిరిలో పవన్ ను కలిసిన ప్రకృతి ప్రేమికుడు విజయ్ రామ్

### ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై సూచన



**పెన్ పవర్ డెస్క్:**త్వరలో వినాయక చవితి పర్వదినం రానున్న నేపథ్యంలో, అందరూ మట్టి గణపతినే పూజించాలని ఏపీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఇవాళ పర్యావరణ ప్రేమికుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్ రామ్ మంగళగిరిలో మంత్రి పవన్ కల్యాణ్ నివాసానికి విచ్చేశారు. పవన్ కల్యాణ్ తో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, త్వరలో వినాయక చవితి రాబోతోందని, ఈ వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అంతేకాకుండా, జల కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చని తెలిపారు. మట్టి గణపతికి పూజలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అభిప్రాయపడ్డారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలనే ఉపయోగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్టు పవన్ వెల్లడించారు. ఇక, దేవాలయాల్లో ప్రసాదాలను బటర్ పేపర్ తో చేసిన కవర్లలో అందిస్తున్నారని, అయితే బటర్ పేపర్ వినియోగాన్ని తగ్గించాలని నిపుణులు చెబుతున్నారని వివరించారు. బటర్ పేపర్ కవర్ల స్థానంలో చిన్నపాటి తాటాకు బుట్టలు, ఆకులతో చేసిన దొన్నెలు వాడాలని సూచించారు. వాటి వ్యర్థాల నిర్వహణ కూడా సులభమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వీటి వినియోగాన్ని పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఆలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించబోతున్నామని వెల్లడించారు. కాగా, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్ రామ్ ఇవాళ పవన్ ను కలిసిన సందర్భంగా... ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అవసరమైన సూచనలు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని వస్తువుల వినియోగంపై తన ఆలోచనలు పంచుకున్నారు. అంతేకాదు, ప్రకృతి సేద్యం విధానంలో పండించిన గోవింద భోగ్, రత్న చోడి, మాప్పిళ్లై సాంబ తదితర బియ్యం రకాలను కూడా పవన్ కు చూపించారు.

# చంద్రబాబుపై విమర్శలు గుప్పించిన సజ్జల

### హామీల విషయంలో చంద్రబాబు సన్నాయినొక్కులు నొక్కుతున్నారన్న సజ్జల

### ప్రజలను మళ్లీ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపాటు

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చంద్రబాబుకు 6 నెలల క్రితమే తెలుసని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వంపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా గడవక ముందే... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం సాధ్యం కాదని సన్నాయినొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉందని అంటున్నారని... అన్నీ తెలిసి, ఆచరణ సాధ్యం కాని హామీలను ఎందుకిచ్చారో వాళ్లే చెప్పాలని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను ఎలా మోసం చేశారో... అలాంటి మోసానికే మళ్లీ శ్రీకారం చుట్టారని చెప్పారు.

వివరాలు 2లో..

# అక్రమ ఇసుక నిల్వలపై విచారణకు ఆదేశించిన అయ్యన్నపాత్రుడు

### గబ్బాడ ఇసుక డిపోలోని అక్రమ నిల్వలపై విచారణకు ఆదేశించిన అయ్యన్న

### 65 వేల టన్నుల ఇసుకపై విచారణ జరపాలన్న స్పీకర్

### ఇసుకను దోచుకున్న మాఫియాను బయట పెట్టాలన్న అయ్యన్న



**పెన్ పవర్ డెస్క్:**పేదలకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన జీవోను కూడా వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

# వైఎస్సార్ రుణాన్ని కాంగ్రెస్ పార్టీ తీర్చుకోలేదు మాజీ మంత్రి జోగి రమేశ్



- తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు
- వైఎస్సార్ కారణంగానే తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బతికిందన్న జోగి రమేశ్
- రాష్ట్రంలో వైసీపీకి కాంగ్రెస్ పార్టీ అసలు పోటీయే కాదని వ్యాఖ్య

వివరాలు 2లో..

# నాన్నా.. ఈరోజు మా అందరికీ పండుగ రోజు

### తండ్రి వైఎస్ పుట్టినరోజు సందర్భంగా జగన్ ట్వీట్

### కోట్లాది కుటుంబాలు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయన్న జగన్

### మీ ఆశయాల సాధనే తమ లక్ష్యమన్న మాజీ సీఎం



**పెన్ పవర్ డెస్క్:**తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎక్స్ వేదికగా భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. 'నాన్నా.. మీ 75వ పుట్టినరోజు మా అందరికీ పండుగ రోజు. కోట్లాది కుటుంబాలు ఇవాళ మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి. వైసీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మీ

వివరాలు 2లో..

# ఎమ్మెల్సీగా ఏకగ్రీవం... సర్టిఫికెట్ అందుకున్న జనసేన నేత హరిప్రసాద్



- ఏపీలో ఎమ్మెల్యేల కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ
- టీడీపీ నుంచి సి.రామచంద్రయ్యకు, జనసేన నుంచి హరిప్రసాద్ కు చాన్స్
- ఇరువురు ఏకగ్రీవ ఎన్నిక
- అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న హరిప్రసాద్

వివరాలు 2లో..

# పావుగంటలో మంత్రిగా రెండుసార్లు ప్రమాణం!



- మధ్యప్రదేశ్ కేబినెట్ విస్తరణ సందర్భంగా విచిత్ర ఘటన
- ఇటీవల బీజేపీలో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్ నివాస్ రావత్ ను మంత్రివర్గంలోకి తీసుకున్న సీఎం మోహన్ యాదవ్
- కాగితాల్లో పొరపాటు దొర్లడంతో తొలుత సహాయ మంత్రిగా ప్రమాణం, ఆ తర్వాత 15 నిమిషాలకు కేబినెట్ మంత్రిగా మరోసారి ప్రమాణస్వీకారం

**పెన్ పవర్ డెస్క్:**మధ్యప్రదేశ్ లో సోమవారం జరిగిన కేబినెట్ విస్తర ణలో అసాధారణ, విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. సజావుగా సాగాల్సిన ఈ ప్రక్రియ గందరగోళం మధ్య ముగిసింది. ఏం జరిగిందంటే.. లోక్ సభ ఎన్నికలకు ముందు

వివరాలు 2లో..

# ఇకపై సినిమాల్లో అలాంటి సన్నివేశాలు ఉండకూడదు

- అవిటివాడు, స్పాస్టిక్ వంటి పదాలు వారిపై సామాజిక వివక్షకు దారితీస్తాయన్న సుప్రీంకోర్టు
- సినిమా స్క్రీనింగ్‌కు ముందు సీబీఎఫ్‌సీ నిపుణుల అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచన
- దివ్యాంగులపై వాస్తవాలను చిత్రీకరించడానికి దృశ్య మీడియా కృషి చేయాలని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**'అవిటివాడు', 'స్పాస్టిక్' వంటి పదాలు వారిని సామాజిక వివక్షకు గురయ్యేలా చేస్తాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో సినిమాలు, దృశ్య

వివరాలు 2లో..

### రెండు రాష్ట్రాలు రెండు కళ్లు అని చంద్రబాబు అంటున్నారు...

# దీనిపై అనుమానాలున్నాయి

### ఇటీవల హైదరాబాదులో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం

### సీఎంల సమావేశం వివరాలు ఎందుకు బహిర్గతం చేయడంలేదన్న అంబటి

### ఈ సమావేశంపై చాలా ప్రశ్నలకు సమాధానం లేదని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఇటీవల హైదరాబాదులో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడంపై ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు తనకు రెండు రాష్ట్రాలు రెండు కళ్ల వంటివని చేసిన వ్యాఖ్యల పట్ల అంబటి సందేహాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు తెలంగాణ డిమాండ్లను

వివరాలు 2లో..

# నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే

### నీట్ పేపర్ లీక్ పై కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు

### ఇటీవల నీట్ యూజీ ఎంట్రన్స్ పేపర్ లీక్

### సుప్రీంకోర్టులో నేడు విచారణ

### నీట్ పేపర్ లీక్ అయిన మాట వాస్తవం అని నిర్ధారించిన సుప్రీంకోర్టు

### లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో తేలాల్సి ఉందని వెల్లడి




**పెన్ పవర్ డెస్క్:**నీట్ యూజీ ఎంట్రన్స్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరిగింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకైన మాట వాస్తవం అని స్పష్టం చేసింది. అయితే, లీకైన పేపర్ ఎంతమందికి చేరిందన్న విషయం తేలాల్సి ఉందని పేర్కొంది. పేపర్ లీక్ తో ఇద్దరు విద్యార్థులకే సంబంధం ఉందని అంటు న్నారు... లీకైన పేపర్ ఎంతమందికి చేరిందో గుర్తించారా పేపర్ లీక్ తో ఎంతమంది ప్రయోజనం పొందారో గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందా పేపర్ లీక్ తో ప్రయోజనం పొందిన విద్యార్థులపై ఏం చర్యలు తీసుకున్నారు? ఎంతమంది విద్యార్థుల ఫలితాలు విత్ హెల్డ్ లో ఉంచారు? అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నీట్ పేపర్ లీక్ అనేది 23 లక్షల మందితో ముడిపడిన అంశమని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందుకే, అన్ని వైపుల నుంచి జాగ్రత్తగా పరిశీలించాకే తీర్పు ఇస్తామని స్పష్టం చేసింది. అనంతరం, తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది.

## సంపాదకీయం

# వర్షాలు పడుతున్నాయ్.. ఈ జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం లేదంటే..!

భారీ వర్షా లే కాదు... చిన్నచిన్న తుంపర్లు పడుతున్నా... ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగే నీటి దగ్గరి నుంచి... అన్నింట్లోనూ ఆచితూచి వ్యవహరించాలి. మరి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే... ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చో తెలుసుకుందాం.

సమస్యలు...

వర్షాలు పడినప్పుడు ఇంటి పరిసర ప్రాంతాల్లో అంటే గుంతల్లో, రోడ్ల మీద, బయట పాత సామాన్లలో నీళ్లు నిలుస్తాయి. అలాంటి చోట దోమలు ఎక్కువగా చేరి... వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉంది. • అలాగే ఈ కాలంలో ఎగ్జిమా, యాక్నె, సోరియాసిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలు తీవ్రంగా మారే అవకాశాలు ఉంటాయి. ఆరోగ్యంగా ఉండేందుకు చిట్కాలు...

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వైరల్ ఇన్ఫెక్షన్లు, చర్మ సమస్యలు ఎక్కువగా వస్తాయి. అలా జరగకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ.. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి. • స్ట్రీట్ ఫుడ్ ఎక్కువగా తినేవాళ్లు... ఈ కాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీలైనంత వరకు బయట తినడం మానేయాలి. అంతేకాదు... బయట కొన్న పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగాకే తినాలి.

దోమల వల్ల వ్యాపించే వ్యాధుల నుంచి రక్షించుకోవాలంటే రోజూ చేతులు, కాళ్లకు ఇన్సెక్ట్ రెపెల్లెంట్ రాసుకోవాలి. అలాగే యాంటీ మలేరియా మందులను కూడా తీసుకోవడం మంచిది. వీలైనంత వరకు మురికి నీళ్లు ప్రవహించే చోటికి వెళ్లకపోవడం మేలు.

వానలో తడిస్తే ఇంటికి రాగానే... తడిగా ఉన్న బట్టలు, సాక్స్ ని విడవాలి. కాళ్లను నీళ్లతో కడిగి తుడుచుకోవాలి.

వర్షంలో తడిచాక స్నానం చేయడం తప్పనిసరి.

మార్కెట్ లో దొరికే యాంటీ బ్యాక్టీరియల్ సబ్బుని వాడాలి. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి.

శరీరాన్ని వెచ్చగా, పొడిగా ఉంచుకుంటే... జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవచ్చు.

ఏసీ ఉన్న రూముల్లోకి తడి జుట్టు, దుస్తులతో వెళ్లొద్దు.

ఈ కాలంలో ఎప్పుడూ కాస్తంత వదులుగా ఉన్న కాటన్ దుస్తులే వేసుకోవాలి. వీలైనంత వరకు సింథటిక్ ఫైబర్కు దూరంగా ఉండాలి.

చర్మంపై చెమట, తేమ పేరుకుపోకుండా యాంటీ ఫంగల్ పౌడర్ను వాడాలి. ఏదైనా ఇన్ ఫెక్షన్తో బాధపడుతున్నట్లైతే.... డాక్టర్ల సలహా మేరకు మెడికల్ పౌడర్లను ఉపయోగించాలి.

ఆస్తమా, డయాబెటిస్ బాధితులు... చినుకులు పడుతున్న కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. • క్రమం తప్పకుండా రెగ్యులర్ వాడే మందులతో పాటు వ్యాక్సినేషన్ తీసుకోవాలి.

మామూలు టీ కంటే హెర్బల్ టీ తాగడం మంచిది. అలాగే వేడి చేసి, చల్లార్చిన నీళ్లన తాగాలి.

విటమిన్-సి ఉన్న కూరగాయలు, పండ్లను తరచూ తీసుకోవాలి. అవి రోగనిరోధకశక్తిని పెంచుతుంది. • పిల్లల చర్మం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. మృదువుగా, సున్నితంగా ఉండే పిల్లల చర్మానికి డాక్టర్ల పర్యవేక్షణలో మాయిశ్చరైజర్ వాడాలి.

# పావుగంటలో మంత్రిగా రెండుసార్లు ప్రమాణం!

- మొదటి పేజీ తరువాయి

బీజేపీలో చేరిన కాంగ్రెస్ విజయపూర్ ఎమ్మెల్యే రామ్ నివాస్ రావత్ ను సీఎం మోహన్ యాదవ్ తన మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం సోమవారం రాజ్ భవన్ లో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. గవర్నర్ మంగూభాయ్ సి. పటేల్.. రామ్ నివాస్ రావత్ చేత ఉదయం 9 గంటల 3 నిమిషాలకు మంత్రిగా ప్రమాణం చేయించారు. అయితే కేబినెట్ మంత్రి బదులు సహాయ మంత్రిగా ఆయన పొరపాటున ప్రమాణస్వీకారం పూర్తి చేశారు. చివరకు జరిగిన పొరపాటును గుర్తించి 15 నిమిషాల తర్వాత కేబినెట్ మంత్రిగా మరోసారి ఆయన ప్రమాణం చేశారు. కానీ ఈ కార్యక్రమం నిర్వహణా లోపాలను బయటపెట్టింది.

మంత్రిగా ప్రమాణం చేసిన రావత్ మరో వెరైటీ రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభుత్వంలో మంత్రి అయిన తొలి వ్యక్తిగా నిలిచారు. ఎందుకంటే.. ఆయన ఇంకా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. గతేడాది జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు.

అలాగే ఒకేసారి రెండు మంత్రి పదవులు పొందిన అరుదైన నాయకుడిగానూ ఆయన మరో రికార్డును సొంతం చేసుకున్నారు. తొలిసారి సహాయ మంత్రిగా ప్రమాణం చేసిన ఆయన.. ఆ పదవికి రాజీనామా చేయకుండానే రెండోసారి కేబినెట్ మంత్రిగా ప్రమాణం చేయడంతో సాంకేతికంగా ఆయన రెండు మంత్రి పదవులను కలిగి ఉన్నట్లయింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎన్డీటీవీ వార్తాసంస్థతో రావత్ మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరడంపై తనకు ఎలాంటి విచారం లేదని చెప్పుకొచ్చారు. 'వాళ్లు (కాంగ్రెస్ నేతలు) నాకు ఏం ఇవ్వలేదో ఈ ప్రభుత్వం నాకు అది ఇచ్చి నన్ను గౌరవించింది' అని రావత్ తెలిపారు. తాను పార్టీ మారినందుకు తిట్టిపోసే హక్కు కాంగ్రెస్ కు లేదని ఆయన స్పష్టం చేశారు.

అలాగే అసాధారణ రీతిలో జరిగిన తన ప్రమాణంపైనా రావత్ స్పందించారు. 'నేను పొరపాటున 'కా' అనే పదాన్ని చదవడం మర్చిపోయాను. అందుకే రెండోసారి ప్రమాణం చేశా. ఇలా ప్రమాణం చేసిన తొలి మంత్రిని నేనే' అని రావత్ చెప్పారు.

మరోవైపు రావత్ పై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే స్పీకర్ నరేంద్రసింగ్ తోమర్ ను కోరిన కాంగ్రెస్ పార్టీ ఈ వ్యవహారంపై వెంటనే స్పందించింది.'సీఎం మోహన్ యాదవ్ ప్రభుత్వం సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పుకుంటోంది. కానీ ఇవాళ జరిగిన నిర్లక్ష్యం, పొరబాటు దేశంలో ఇప్పటివరకు జరగలేదు. ఈ విషయంలో ఇప్పుడు గందరగోళం నెలకొంది. గవర్నర్ కార్యాలయం నిర్లక్ష్యం వల్లో లేదా రాజకీయ పెద్దల ఒత్తిళ్ల వల్లో అలా జరిగి ఉండొచ్చు' అంటూ పరోక్షంగా మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మాజీ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలను ఉద్దేశించి కాంగ్రెస్ అధికార ప్రతినిధి అవనీష్ బుందేలా వ్యాఖ్యానించారు.

# వైఎస్సార్ రుణాన్ని కాంగ్రెస్ పార్టీ తీర్చుకోలేదు

**పెన్ పవర్ డెస్క్:** దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ రుణాన్ని కాంగ్రెస్ పార్టీ తీర్చుకోలేదన్నారు. ఆయన జయంతిని ఎవరైనా చేసుకోవచ్చని తెలిపారు. వైఎస్ను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కూడా కీర్తించొచ్చని చెప్పారు.

వైఎస్సార్ కారణంగానే తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బతికిందన్నారు. తెలంగాణలో కాదని, దేశం మొత్తం వైఎస్ జయంతి చేసినా ఆయన రుణం కాంగ్రెస్ తీర్చుకోలేదని జోగి రమేశ్ చెప్పుకొచ్చారు. ఇక రాష్ట్రంలో వైసీపీకి కాంగ్రెస్ పార్టీ అసలు పోటీయే కాదన్నారు. ఆ పార్టీకి ఏపీ ఎన్నికల్లో ఎన్ని ఓట్లు వచ్చాయో అందరికి తెలుసంటూ ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ పార్టీతో వైసీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. తమ పార్టీ పేరులో వైఎస్ఆర్ ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు తమ వైపే ఉన్నారని చెప్పిన మాజీ మంత్రి.. మళ్లీ తప్పకుండా అధికారంలోకి వస్తామని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

## రెండు రాష్ట్రాలు రెండు కళ్లు అని చంద్రబాబు అంటున్నారు...

# దీనిపై అనుమానాలున్నాయి

- మొదటి పేజీ తరువాయి

అంగీకరించినట్టేనా? ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన ఏం ద్రోహం చేయబోతున్నారు? రెండు రాష్ట్రాలు రెండు కళ్లు వంటివని అనడంలో అంతరార్థం ఏమిటి? దీని వెనుక ఏం కుట్ర ఉంది? ఇద్దరు సీఎంల సమావేశంలో ఏం చర్చించారు? ఎందుకు ఆ వివరాలను రహస్యంగా ఉంచుతున్నారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

"ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చాలా ప్రశ్నలకు సమాధానం రాలేదు. ఆ సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారో కూడా చెప్పలేదు. టీటీడీ ఆదాయంలో, ఏపీ పోర్టుల్లో వాటా కావాలని తెలంగాణ అడిగింది. నాగార్జున సాగర్ డ్యామ్ విషయంలో అనేక వివాదాలు ఉన్నాయి... దానిపై చంద్రబాబు మాట్లాడకపోవడం ఏంటి?" అని అంబటి ధ్వజమెత్తారు. "ఆంధ్రప్రదేశ్ విభజన జరిగాక రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి చంద్రబాబు... కానీ, పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సిన హైదరాబాద్ ను వినియోగించుకోకుండా చంద్రబాబు ఎందుకు పారిపోయి వచ్చారు? తప్పు చేసినందునే మెడపట్టి గెంటేశారు.


రాష్ట్ర విభజన వలన ఏపీకి తీవ్ర అన్యాయం జరిగితే... తెలంగాణతో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా చంద్రబాబు అంతకంటే ఎక్కువగా ఏపీకి అన్యాయం చేశారు. ఇప్పుడు ఐదు గ్రామాలను తెలంగాణకు ఇచ్చేసేందుకు చంద్రబాబు అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. చంద్రబాబు పర్సనల్ విషయాల కోసం ఆ గ్రామాలను తెలంగాణకు ఇచ్చేస్తున్నారా? అదే నిజమైతే పోలవరం ప్రాజెక్టుకు చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నట్టే. పోలవరంకు నష్టం జరిగింది కాంట్రాక్టరును మార్చడం వల్లో, రివర్స్ టెండరింగ్ వల్లనో కాదు... చంద్రబాబు హయాంలో కాఫర్ డ్యాంలు పూర్తి కాకుండానే డయాఫ్రం వాల్ కట్టడం వల్లే పోలవరంకు నష్టం జరిగింది. చంద్రబాబు నది మధ్యలో కాఫర్ డ్యామ్ కట్టడం వల్లే పోలవరం ఆలస్యం అయింది. మొన్నటి సీఎంల సమావేశంలో పోలవరంలో 51.5 అడుగుల వరకు నీటిని నింపవద్దని తెలంగాణ కోరినట్టు అనుమానంగా ఉంది. ఆ విషయాలేమీ మాట్లాడకుండా డ్రగ్స్ గురించి చెబుతారేంటి?" అంటూ అంబటి రాంబాబు ధ్వజమెత్తారు.

# రేవంత్ రెడ్డి గారూ... మీ ముందు ఒక మహత్తరమైన అవకాశం ఉంది: ఉండవల్లి అరుణ్ కుమార్

**మంగళగిరిలో వైఎస్సార్ 75వ శతజయంతి వేడుకలు**

**ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**

**తన ప్రసంగంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ ఉండవల్లి**



మంగళగిరిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ 75వ జయంతి వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "వైఎస్సార్ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. ఇవాళ ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు... ఓ మాట చెప్పకపోతే బాగుండదు. రేవంత్ రెడ్డి గారూ... ఇవాళ మీ ముందుకు ఒక మహత్తరమైన అవకాశం వచ్చింది. ఆంధ్రా, తెలంగాణ మధ్య శాశ్వతంగా ఒక అనుబంధాన్ని కల్పించే అవకాశం మీకు వచ్చింది. ఈ మాట ఎందుకన్నానంటే... ఇది కాంగ్రెస్ వాళ్లే చేయగలరు. జెనెటిక్ గా కాంగ్రెస్ ముఖ్యమంత్రే ఈ పని చేయగలడు. ఆంధ్రా వాళ్లకు ఏనాడు కూడా తెలంగాణ వాళ్లపై ఎలాంటి కోపం లేదు, ఏ రకమైన ద్వేషం లేదు... అది మీకు కూడా తెలుసు. కానీ మీకు మా మీద కోపం వచ్చింది... దానికో కారణం ఉంది... అది మాకు తెలుసు. పొన్నం ప్రభాకర్, నేను ఐదేళ్లు మాట్లాడుకోలేదు. అప్పట్లో ఇద్దరం ఎంపీలం... బాగా క్లోజ్ గా ఉండేవాళ్లం. ఎదురుపడినా పలకరించుకోలేని పరిస్థితి. రుద్రరాజు తండ్రి చనిపోయిన సమయంలో మళ్లీ పలకరించుకున్నాం. "ఏం పొన్నం" అంటే "ఏం అరుణా" అన్నాడు. ఏంటంటే... రాజకీయ కారణాలే.

రేవంత్ రెడ్డి గారూ... ఒక్కసారి ఈ కారణాలన్నింటిపై మీరు దృష్టి పెడితే కచ్చితంగా వీటిని సెటిల్ చేయవచ్చు. ఏపీ, తెలంగాణ టెక్నికల్ గా రెండు రాష్ట్రాలు తప్ప... రెండు రాష్ట్రాల ప్రజలు ఒక్కటే అనే సందేశం మీరు ఇవ్వగలరు. అందుకోసం పాలనా పరంగా ముఖ్యమంత్రులుగా మీరేం చేస్తారో ఎలాగూ చేస్తారు. ఈ వేదికపై రాజశేఖర్ రెడ్డి కూతురు (షర్మిల) కూడా ఉంది... ఆ సంగతి మర్చిపోవద్దు. ఏపీ ప్రజలకు ఏం చేస్తే నష్టం లేకుండా ఉంటుందో, రాజశేఖర్ రెడ్డి కూతురును కూడా కలుపుకుని ఆ విధంగా ముందుకు వెళ్లండి. కేవీపీ రామచంద్రరావు వంటి నేత హైదరాబాదులోనే ఉంటున్నారు... ఆయన నుంచి మీకు సహకారం అందుతుంది. కచ్చితంగా ఈ క్రెడిట్ మీకు దక్కడం కోసం మీరు ముఖ్యమంత్రి అయ్యారని భావిస్తున్నాను. రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులు మీకు ఎప్పుడూ ఉంటాయి" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఉండవల్లి అరుణ్ కుమార్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# చంద్రబాబుపై విమర్శలు గుప్పించిన సజ్జల

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఖజానా ఇంత దారుణంగా ఉందని అనుకోలేదని చంద్రబాబు అంటున్నారని... 6 నెలల క్రితమే ఈ విషయం ఆయనకు తెలుసని... అయినప్పటికీ అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలకు పాల్పడుతున్నారని, వైసీపీకి ఓటు వేశారంటూ ప్రజలను హింసిస్తున్నారని, వ్యవస్థలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కక్ష సాధింపులకు పాల్పడలేదని... ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించారని అన్నారు.

# నాన్నా.. ఈరోజు మా అందరికీ పండుగ రోజు

- మొదటి పేజీ తరువాయి

పుట్టినరోజున సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. శ్రేయస్సు కోసం మీరు చూపిన మార్గం మాకు శిరోధార్యం. జీవితాంతం మీరు పాటించిన క్రమశిక్షణ, చేసిన కఠోర శ్రమ, రాజకీయాల్లో మీరు చూపిన ధైర్య సాహసాలు మాకు మార్గం. మీ ఆశయాల సాధనే లక్ష్యంగా, కోట్లాది కుటుంబాల క్షేమమే ధ్యేయంగా చివరివరకూ మా కృషి' అని ఆయన ట్వీట్ చేశారు. మరోవైపు ఇడుపులపాయలోని వైఎస్ ఘాట్ వద్ద తన భార్య భారతితో కలిసి జగన్ నివాళి అర్పించారు. భర్త, కొడుకు, కోడలు, కూతురుతో కలిసి ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నివాళి అర్పించారు. జగన్, షర్మిల ఇద్దరూ విడివిడిగా తమ తండ్రికి నివాళి అర్పించి, ప్రార్థనలు నిర్వహించారు.

# అక్రమ ఇసుక నిల్వలపై విచారణకు ఆదేశించిన అయ్యన్నపాత్రుడు

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇసుక కోసం ప్రజలు ఇసుక డిపోలకు క్యూ కడుతున్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని గబ్బాడ ఇసుక డిపోలో ఉన్న అక్రమ నిల్వలపై అయ్యన్నపాత్రుడు విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిపోలో అక్రమంగా నిల్వ ఉంచిన 65 వేల టన్నుల ఇసుకపై విచారణ జరపాలని చెప్పారు. వందల కోట్లను అక్రమంగా దోచుకున్న మాఫియాను బయట పెట్టాలని అన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. దొంగలను పట్టుకోకుండా ఇసుక పంచితే సాక్ష్యాలను తొలగించినట్టు అవుతుందని అన్నారు. విచారణ జరిపి కేసు నమోదు చేసిన తర్వాతే ఇసుక బయటకు తీయాలని సూచన చేశారు.

# ఇకపై సినిమాల్లో అలాంటి సన్నివేశాలు ఉండకూడదు

- మొదటి పేజీ తరువాయి


మాధ్యమాల్లో దివ్యాంగులను కించపరిచేలా సన్నివేశాలను చిత్రీకరించడాన్ని వ్యతిరేకిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం సోమవారం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. సినిమా స్క్రీనింగ్‌కు అనుమతించే ముందు సర్టిఫికేట్ ఇచ్చే సీబీఎఫ్‌సీ నిపుణుల అభిప్రాయాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించింది. దివ్యాంగులపై వాస్తవాలను చిత్రీకరించడానికి దృశ్య మీడియా కృషి చేయాలని తెలిపింది. అలాగే దివ్యాంగుల సవాళ్లను మాత్రమే కాకుండా వారి విజయాలు, ప్రతిభ, సమాజానికి చేసిన సేవను చూపించాలని న్యాయస్థానం పేర్కొంది. ఇటీవల వచ్చిన బాలీవుడ్ చిత్రం 'ఆంఖ్ మిచోలీ'లో దివ్యాంగులను కించపరిచేలా సన్నివేశాలు ఉన్నాయని నిపున్ మల్హోత్రా అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెల్లడించింది.

## ఎమ్మెల్సీగా ఏకగ్రీవం... సర్టిఫికెట్ అందుకున్న జనసేన నేత హరిప్రసాద్

**పెన్ పవర్ డెస్క్:** ఇటీవల ఏపీలో ఎమ్మెల్యేల కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ నుంచి సి.రామచంద్రయ్య, జనసేన నుంచి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, హరిప్రసాద్ నేడు అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, జనసేనాని పవన్ కల్యాణ్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.

"శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. ఎమ్మెల్సీ పదవిని బాధ్యతాయుతమైన పదవిగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం, మా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు, టీడీపీ, జనసేన నేతలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. శాసనమండలి తొలి సమావేశాలు ప్రారంభం అయ్యేందుకు కొంత సమయం ఉంది. కౌన్సిల్ సమావేశాలు, ప్రశ్నోత్తరాలు, చర్చ, భవిష్యత్తులో ఎలా ముందుకు వెళ్లాలి? అనే అంశాలపై అధ్యయనం చేయడానికి నాకు ఈ సమయం ఉపయోగపడుతుంది" అని హరిప్రసాద్ పేర్కొన్నారు.

# డీఎస్సీని వాయిదా వేయాలని అభ్యర్థుల నిరసన.. హైదరాబాదులో విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత!




డీఎస్సీని వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు నిరసనకు దిగడంతో హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. 3 నెలలు వాయిదా వేయాలంటూ అభ్యర్థులు కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దాంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. వరుసగా పోటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో చదువుకోవడానికి సమయం సరిపోదని అభ్యర్థులు చెబుతున్నారు. ఇటీవలే టెట్ ఫలితాలు విడుదలయిన నేపథ్యంలో డీఎస్సీని వాయిదా వేయాలని అభ్యర్థులు కోరారు. ఇక ఉపాధ్యాయుల నియామకాలు పూర్తి అయ్యేవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని వారు కోరుతున్నారు.

# మాజీ మంత్రి జోగి రమేశ్ పై మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్ లను ఆశ్రయించిన రంగబాబు అనే వ్యక్తి

**జోగి రమేశ్ పై భూ అక్రమాల ఆరోపణలు**

**జోగి రమేశ్ కు కొందరు అధికారులు సహకరించారన్న బాధితుడు**

**బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి అనగాని**



మాజీ మంత్రి జోగి రమేశ్ భూ అక్రమాలకు పాల్పడ్డారంటూ రంగబాబు అనే వ్యక్తి నేడు ఏపీ మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్ లను ఆశ్రయించారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను గ్రామంలో తాను భూమి అమ్ముతున్నానన్న విషయం తెలుసుకున్న జోగి రమేశ్... ఆ భూమిని కావాలనే వివాదాస్పద భూమిగా ముద్రవేయించారని, పొలం ఎందుకు వివాదంలోకి వెళ్లిందని ఎమ్మార్వోను అడిగితే, వెళ్లి జోగి రమేశ్ ను కలవమని చెప్పారని రంగబాబు వెల్లడించారు. దాంతో, కొందరు సన్నిహితులతో కలిసి జోగి రమేశ్ కు వద్దకు వెళితే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, కానీ రెండ్రోజుల తర్వాత శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తితో ఫోన్ చేయించి, రూ.15 లక్షలు ఇస్తేనే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారని వివరించారు. చేసేది లేక వారు అడిగిన రూ.15 లక్షలు ఇచ్చానని, కానీ శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి మూడు నెలల పాటు ఫోన్ ఎత్తలేదని, ప్రెస్ మీట్ పెడతానని హెచ్చరిస్తే అప్పుడు తన సమస్య పరిష్కరించారని రంగబాబు వివరించారు. అయితే, ఇప్పుడు తనకు చెందిన మరికొంత భూమిపై వారు కన్నేశారని తెలిపారు. పెడన నియోజకవర్గంలో 30 ఎకరాల భూమికి నకిలీ దస్తావేజులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. జోగి రమేశ్ కు స్టాంపు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, కొందరు సబ్ రిజిస్ట్రార్లు సహకరించారని రంగబాబు వివరించారు. జోగి రమేశ్ కు బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ మద్దతుగా నిలుస్తున్నారని రంగబాబు... మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్ లకు ఆయన వివరించారు. దీనిపై స్టాంపు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెంటనే స్పందించారు. బంటుమిలి సబ్ రిజిస్ట్రార్ కు ఫోన్ చేశారు. అక్రమాలకు సహకరిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, బాధితుడు రంగబాబు... జోగి రమేశ్ పై సీఐడీకి ఫిర్యాదు చేస్తానని చెబుతున్నారు.

## ఉచితం ముసుగులో టీడీపీ నేతలు కోట్లాది రూపాయల ఇసుక దోచేస్తున్నారు



ఏపీ ప్రభుత్వం నేటి నుంచి రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోంది. అయితే, ఉచిత ఇసుక ముసుగులో ప్రజలకు టీడీపీ కూటమి ప్రభుత్వం కుచ్చుటోపీ పెడుతోందని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పేట్ల ఉమాశంకర్ గణేశ్ ధ్వజమెత్తారు. ఉచితం ముసుగులో టీడీపీ నేతలు కోట్లాది రూపాయల ఇసుక దోచేస్తున్నారని ఆరోపించారు.

"కూటమి నేతలు ఉచితంగా ఇసుక ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ఉచితంగా ఇసుక లభిస్తుందని చాలామంది ఆశపడ్డారు. ఇవాళ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఇసుక ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. దాంతో మా నర్సీపట్నం ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు చాలామంది వెళ్లారు. కానీ అక్కడి బోర్డు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. టన్ను ఇసుక ధర రూ.1,225 అని బోర్డు మీద రాసి ఉంది. ఉచితం అని చెప్పి, ఇలా డబ్బులు వసూలు చేయడం దుర్మార్గం. ఇసుక రేట్లు చూసి నర్సీపట్నం ప్రజలు చాలామంది వెనక్కి తిరిగి వచ్చేశారు.

ఇటీవలి వరకు నర్సీపట్నం స్టాక్ పాయింట్ లో లక్ష టన్నుల ఇసుక ఉండాలి... కానీ అందులో 60 వేల టన్నుల ఇసుక మాయమైంది. ఇప్పుడు అడిగితే 40 వేల టన్నుల ఇసుకే ఉందంటున్నారు. కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకోవాలి. రికార్డులు తెప్పించి పరిశీలించాలి. రూ.5 కోట్ల విలువ చేసే ఈ 40 వేల టన్నుల ఇసుకనైనా కాపాడాలి" అని ఉమాశంకర్ గణేశ్ కోరారు. ఉమాశంకర్ గణేశ్ టాలీవుడ్ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ సోదరుడు అని తెలిసిందే.

## ఝార్ఖండ్ అసెంబ్లీ బలపరీక్షలో నెగ్గిన హేమంత్ సోరెన్

**హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా 45 ఓట్లు**

**వాకౌట్ చేసిన విపక్షం**

**ఇటీవల బెయిల్‌పై విడుదలైన హేమంత్ సోరెన్**



ఝార్ఖండ్ అసెంబ్లీలో సోమవారం నిర్వహించిన బలపరీక్షలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నెగ్గారు. 81 మంది ఎమ్మెల్యేలకు గాను 45 మంది ఆయనకు అనుకూలంగా ఓటు వేశారు. ఓటింగ్ సమయంలో విపక్షాలు వాకౌట్ చేశాయి.

హేమంత్ సోరెన్ భూకుంభకోణం కేసులో అరెస్టై ఇటీవల విడుదలయ్యారు. ఆయన అరెస్ట్ తర్వాత దాదాపు ఐదు నెలలు చంపయి సోరెన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. హేమంత్ సోరెన్ విడుదల కావడంతో ఆయన రాజీనామా చేశారు. ఐదు నెలల అనంతరం మళ్లీ సీఎంగా ప్రమాణం చేశారు. హేమంత్ ఇటీవల మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనంతరం అసెంబ్లీలో విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అధికార కూటమిలో హేమంత్ సోరెన్‌కు చెందిన జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. ప్రతిపక్షానికి 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు ఎంపీగా పోటీ చేశారు. దీంతో సభలో సంఖ్యాబలం 76కు తగ్గింది.

## పార్టీని వీడిన వారిని ఆహ్వానించిన భట్టివిక్రమార్క... పీసీసీ అధ్యక్షుడిగా సమర్థిస్తున్నానన్న రేవంత్ రెడ్డి

**కలిసి పని చేద్దామంటూ పార్టీని గతంలో వీడిన వారికి డిప్యూటీ సీఎం పిలుపు**

**ఉపముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో ఏకీభవిస్తున్నానన్న రేవంత్ రెడ్డి**

**రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా అందరూ రావాలన్న సీఎం**



కాంగ్రెస్‌ను వీడిన నేతలు అందరూ తిరిగి రావాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆహ్వానించగా... ఆ మాటలను సమర్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. గాంధీ భవన్‌లో వైఎస్ జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టివిక్రమార్క... పార్టీని వీడిన నేతలను తిరిగి రావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ... 'రండి... కలిసి పని చేద్దాం. సంక్షేమం కోసం ముందుకు నడుద్దాం. దూరంగా ఉన్న నాటి కాంగ్రెస్ నాయకులు అందరూ కూడా పార్టీలోకి రావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాన'ని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు గ్రామాల్లో తల ఎత్తుకొని తిరిగేలా ఈ ప్రభుత్వం పని చేస్తుందని మాట ఇస్తున్నామన్నారు. అనంతరం, ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి... రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా అందరూ కాంగ్రెస్ పార్టీలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. మనమంతా కలిసికట్టుగా నిలబడి... దేశాన్ని బలోపేతం చేసేందుకు పని చేయాలన్నారు. పార్టీని వీడిన నేతలు తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలంటూ ఉపముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో తాను నూటికి నూరు శాతం ఏకీభవిస్తున్నానని... పీసీసీ అధ్యక్షుడిగా సమర్థిస్తున్నానని అన్నారు.

# దానం, కడియంలపై అనర్హత పిటిషన్లపై విచారణ వాయిదా

**బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు**

**వారిపై అనర్హత వేటు వేయాలని కోర్టుకు వెళ్లిన బీఆర్ఎస్**

**వాదనలు విన్న హైకోర్టు... తదుపరి విచారణ గురువారానికి వాయిదా**



ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్ల విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు సహా ఆరడజను మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దానం, కడియం, వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరింది. అనంతరం ఆయన చర్యలు తీసుకోవడం లేదంటూ కోర్టుకు వెళ్లారు. స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో అనర్హత వేటు వేయాలన్న సుప్రీంకోర్టు తీర్పులను స్పీకర్ అమలు చేయడం లేదని హైకోర్టుకు తెలిపారు. వారి వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

# జగన్ కష్టాలను దేవుడే చూసుకుంటాడు: మేనత్త విమలమ్మ



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఇవాళ తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో నివాళులు అర్పించారు. వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జగన్ మేనత్త విమలమ్మ ప్రార్థన చేశారు. "దేవుని యందు భయభక్తులు కలిగి ఉంటే ఏ కష్టము రాదు. రాదు అంటే రాకుండా ఉండడం కాదు... కష్టం వచ్చినప్పుడు దేవుడు మనతో ఉంటాడు. ఎలాంటి సమస్యలైనా ఎదుర్కోవడానికి దేవుడు మనకు శక్తిని ఇస్తాడు. ఇవాళ చూస్తున్నాం... జగన్ బాబు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాడు. కానీ దేవుడి యందు భయభక్తులు కలిగి ఉన్నాడు కాబట్టి, అన్ని కష్టాలు వచ్చినా కూడా దేవుడు వాటిని ఎదిరించే శక్తిని ఇస్తాడు. అందుకే దేవుని యందు భయభక్తులు కలిగి ఉండాలి. ప్రభువు నందు ఆనందించు వారు, ఎల్లవేళలా ఆనందిస్తారు. ఎలాంటి కష్టం వచ్చినా దేవుడు శక్తిని అందిస్తాడు... మనందరం అలాంటి శక్తి కోసం దేవుడిపై ఆధారపడాలి" అని విమలమ్మ పేర్కొన్నారు.

## మంగళగిరిలో వైఎస్ జయంతి వేడుకలు... గన్నవరం చేరుకున్న రేవంత్ రెడ్డి, భట్టివిక్రమార్క

**ముఖ్య అతిథులుగా హాజరవుతున్న తెలంగాణ సీఎం, ఉపముఖ్యమంత్రి**

**హైదరాబాద్ నుంచి గన్నవరం చేరుకున్న రేవంత్, భట్టివిక్రమార్క**

**కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ**



ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న వైఎస్ రాజశేఖరరెడ్డి 75 జయంత్యుత్సవాలకు హాజరయ్యేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. మంగళగిరిలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి రేవంత్, భట్టివిక్రమార్క ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వారు గన్నవరం నుంచి మంగళగిరి కార్యాలయానికి చేరుకోనున్నారు.

**ప్రారంభమైన జయంతి కార్యక్రమం**

మంగళగరిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే మాజీ మంత్రి, తెలంగాణ నేత షబ్బీర్ అలీ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి తదితరులు హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ తదితరులు హాజరవుతున్నారు.

## ఫ్లాట్ గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**లాభాల స్వీకరణకు మొగ్గు చూపిన ఇన్వెస్టర్లు**

**36 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్**

**3 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ**



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు ఫ్లాట్ గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలతో ఈ ఉదయం మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అయితే ఇంట్రాడేలో కాస్త కోలుకున్నాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 36 పాయింట్లు కోల్పోయి 79,960కి పడిపోయింది. నిఫ్టీ 3 పాయింట్లు నష్టపోయి 24,320 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

ఐటీసీ (2.27%), హిందుస్థాన్ యూనిలీవర్ (1.55%), నెస్లే ఇండియా (1.14%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.92%), టాటా మోటార్స్ (0.87).

**టాప్ లూజర్స్:**

టైటాన్ (-3.54%), అదానీ పోర్ట్స్ (-1.65%), టాటా స్టీల్ (-1.40%), ఏసియన్ పెయింట్స్ (-1.31%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-1.21%).


## ఏపీ టెట్ కొత్త షెడ్యూల్ విడుదల

**అభ్యర్థుల విజ్ఞప్తి మేర షెడ్యూల్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం**

**ఈ నెల 2న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు**

**ఆ పరీక్షలు అక్టోబర్ 3 నుంచి 20కి మార్పు**

**మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం**




ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఈటీ) షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. జులై 2న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరగాల్సి ఉండగా, ఆ పరీక్షలను అక్టోబర్ 3 నుంచి 20 వరకు నిర్వహిస్తామని తెలిపింది. ప్రిపరేషన్‌కు సమయం కోసం అభ్యర్థుల అభ్యర్థన మేరకు సవరణ నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసింది. ఇక రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా, డీఎస్సీలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

**టెట్ కొత్త షెడ్యూల్ ఇదే..**

నోటిఫికేషన్ విడుదల: జులై 2, పరీక్ష ఫీజు చెల్లింపునకు, దరఖాస్తుకు ఆఖరి గడువు: ఆగస్టు 3, ఆన్‌లైన్ మాక్ టెస్టు: సెప్టెంబర్ 19 నుంచి , పరీక్షలు: అక్టోబర్ 3 నుంచి 20 వరకు (రెండు సెషన్లలో), ప్రాథమిక కీ విడుదల: అక్టోబర్ 3, ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ: అక్టోబర్ 4 నుంచి, ఫైనల్ కీ విడుదల: అక్టోబర్ 27,ఫలితాల విడుదల: నవంబర్ 2

# రోమ్ నగరం ఒక్కరోజులో కట్టలేదు: అభిషేక్ శర్మ సెంచరీపై యువీ స్పందన

**భారత క్రికెట్లో కొత్త సంచలనం... అభిషేక్ శర్మ**

**జింబాబ్వేపై 47 బంతుల్లో 100 పరుగులు చేసిన అభిషేక్**

**శిష్యుడ్ని అభినందించిన యువరాజ్ సింగ్**



భారత క్రికెట్ వర్గాల్లో అభిషేక్ శర్మ పేరు మార్మోగుతోంది. జింబాబ్వేతో తొలి టీ20 మ్యాచ్ లో డకౌట్ అయిన ఈ యంగ్ స్టర్... రెండో మ్యాచ్ లో రికార్డు సెంచరీతో అదరగొట్టాడు. అంతర్జాతీయ కెరీర్ అరంగేట్ర మ్యాచ్ లో సున్నాకే అవుటైనప్పటికీ, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా రెండో మ్యాచ్ లో పరుగుల సునామీ సృష్టించాడు.

23 ఏళ్ల అభిషేక్ శర్మ గురువు ఎవరో కాదు... ఒకప్పటి టీమిండియా డాషింగ్ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్. నిన్న సెంచరీ కొట్టగానే అభిషేక్ రెండు వీడియో కాల్స్ చేశాడు. ఒకటి కుటుంబానికి, రెండోది తన మెంటార్ యువరాజ్ సింగ్ కు. కాగా, తన శిష్యుడి వీరబాదుడుకు యువీ ముగ్ధుడయ్యాడు. దీనిపై సోషల్ మీడియాలో స్పందించాడు. "రోమ్ నగరం ఒక్కరోజులోనే నిర్మితం కాలేదు. అలాగే, అభిషేక్ శర్మ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఎంతో శ్రమ, పట్టుదల ఉన్నాయి. కెరీర్ లో తొలి సెంచరీ సాధించినందుకు కంగ్రాచ్యులేషన్స్ అభిషేక్ శర్మ. ఇలాంటి సెంచరీలు ఇంకా ఎన్నో రావాలి" అంటూ యువీ ఆశీస్సులు అందించాడు. అంతేకాదు, అభిషేక్ ట్రైనింగ్ సెషన్స్ లో ఎంత కష్టపడి సాధన చేశాడో తెలిపే వీడియోను కూడా పంచుకున్నాడు.

# జింబాబ్వేలో ఉన్న టీమిండియాతో కలిసిన శాంసన్, జైస్వాల్, శివమ్ దూబే

**జింబాబ్వేలో పర్యటిస్తున్న యువ టీమిండియా**

**స్వదేశంలో విజయోత్సవాల కారణంగా ఆలస్యంగా జట్టుతో కలిసిన ముగ్గురు ఆటగాళ్లు**

**మిగిలిన మూడు టీ20లకు ఆసక్తికరంగా మారిన జట్టు ఎంపిక**



భారత్ లో టీ20 వరల్డ్ కప్ విజయోత్సవాల కారణంగా యువ జట్టుతో పాటు జింబాబ్వే వెళ్లలేకపోయిన సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబే... కాస్త ఆలస్యంగా జింబాబ్వేలో ఉన్న టీమిండియాతో కలిశారు. ఇప్పటికే యువ టీమిండియా... జింబాబ్వేతో రెండు టీ20 మ్యాచ్ లు ఆడింది. మిగిలిన మూడు మ్యాచ్ లకు సంజు శాంసన్, జైస్వాల్, శివమ్ దూబే అందుబాటులో ఉండనున్నారు. ఈ ముగ్గురు కీలకమైన ఆటగాళ్లు కావడంతో, జట్టు నుంచి ఎవరిని తప్పించాలన్నది కెప్టెన్ శుభ్ మాన్ గిల్, కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ లకు సమస్యగా మారనుంది. జింబాబ్వేతో తొలి రెండు మ్యాచ్ ల్లో ఓపెనర్లుగా శుభ్ మాన్ గిల్, అభిషేక్ శర్మ బరిలో దిగారు. అభిషేక్ శర్మ నిన్నటి మ్యాచ్ లో సెంచరీ చేయడంతో అతడి స్థానానికి ఢోకా లేదు. వన్ డౌన్ లో వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ 77, సెకండ్ డౌన్ లో వచ్చిన రింకూ సింగ్ 48 పరుగులు చేసి సత్తా నిరూపించుకున్నారు. ఇక, యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, సాయి సుదర్శన్, రియాన్ పరాగ్ లకు నిన్నటి మ్యాచ్ లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. తొలి మ్యాచ్ లో జురెల్ 6, పరాగ్ 2 పరుగులే చేశారు. ఈ నేపథ్యంలో, తదుపరి మూడు మ్యాచ్ ల కోసం టీమిండియాలో ఎవరికి స్థానం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# 'వరల్డ్ ఛాంపియన్లు చివరికి వరల్డ్ ఛాంపియన్లలాగే ఆడారు'.. టీమిండియాపై సికిందర్ రజా ప్రశంసల జల్లు!

**హరారే వేదికగా భారత్, జింబాబ్వే రెండో టీ20**

**100 పరుగుల తేడాతో టీమిండియా బంపర్ విక్టరీ**

**భారత జట్టు రాణించిన తీరుపై జింబాబ్వే సారథి ప్రశంసలు**



ఐదు టీ20ల కోసం జింబాబ్వే పర్యటనలో ఉన్న టీమిండియా హరారే వేదికగా జరిగిన రెండో టీ20లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తొలి టీ20లో 102 పరుగులకే కుప్పకూలి ఓటమి చవిచూసిన యువ భారత్ రెండో మ్యాచ్‌లో అద్భుతంగా పుంజుకొని 100 పరుగుల తేడాతో బంపర్ విక్టరీ నమోదు చేసింది. అయితే, తమ జట్టు పరాజయాన్ని అంగీకరిస్తూ జింబాబ్వే సారథి సికిందర్ రజా మ్యాచ్ అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్ ఛాంపియన్లు చివరికి ఛాంపియన్లలాగే ఆడతారని టీమిండియాపై ప్రశంసల జల్లు కురిపించాడు. జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా మాట్లాడుతూ.. "వరల్డ్ ఛాంపియన్లు చివరికి ఛాంపియన్లలాగే ఆడతారు. మేము క్యాచ్లు జారవిడచడం వల్ల మ్యాచ్ చేజారింది. ఈ వికెట్‌పై 200 రన్స్ సాధ్యమే అనుకున్నా. కానీ, వాళ్లు (భారత్) మరో 30 పరుగులు అదనంగా సాధించారు. ఇక ఛేదనలో కూడా మేం అనుకున్నంత స్థాయిలో రాణించలేపోయాం. ఎంతో పాజిటివ్ మైండ్‌సెట్‌తో మ్యాచ్ ఆడినప్పటికీ అనుభవలేమితో పలు సమస్యలు తలెత్తాయి" అని సికిందర్ రజా చెప్పుకొచ్చాడు.

ఇదిలాఉంటే.. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 234 పరుగుల భారీ స్కోర్ చేసింది. యువ సంచలనం అభిషేక్ శర్మ 46 బంతుల్లోనే శతకం బాదాడు. అతనికి తోడు రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. అనంతరం 235 పరుగుల భారీ ఛేదనలో ఆతిథ్య జట్టు 134 పరుగులకే కుప్పకూలింది. దీంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌లో ప్రస్తుతం ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్నాయి.

# రొమాంటిక్ లవ్ స్టోరీ కోరుతున్న రష్మిక..!

**డాంగే విడుదల కోసం నికితా కౌంట్‌డౌన్ ఆనందం!**





**ఆశు రెడ్డికి యానిమల్ ఫ్యాషన్ ఫీవర్ కలకలం రేపింది**



పుష్ప, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ రష్మిక మందన్న. నేషనల్ క్రష్ ఇమేజ్ తో దూసుకు పోతున్న రష్మిక మందన్న ఇటీవల జపాన్ లో జరుగుతున్న క్రంచీరోల్ అనిమే అవార్డ్స్ 2024 కి హాజరు అయిన విషయం తెల్సిందే. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రష్మిక మందన్న తన ఫ్యూచర్ ప్లాన్స్ తో పాటు తన ప్రస్తుత సినిమాల గురించి చెప్పుకొచ్చింది. ఇండస్ట్రీ లో మంచి సినిమాలు చేయాలని, ప్రతి సారి సినిమాలో మెయిన్ లీడ్ దక్కాలంటే సాధ్యం కాదు. కనుక కొన్ని సార్లు కమర్షియల్ పాత్రలు చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది.

సోషల్ మెసేజ్ ఇచ్చే సినిమాలను చేయాలని కోరుకుంటున్నట్లుగా పేర్కొంది. ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో నేను చేసిన అన్ని సినిమాలు కూడా యాక్షన్ డ్రామా సినిమాలే. కానీ నేను మాత్రం ముందు ముందు అయినా రొమాంటిక్ లవ్ స్టోరీ సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నాను.

ఈ మధ్య కాలంలో రొమాంటిక్ లవ్ స్టోరీ సినిమాలు చాలా తక్కువ అయ్యాయి. ఫిల్మ్ మేకర్స్ అంతా కూడా యాక్షన్ ఎంటర్ టైన్‌మెంట్స్ పై పడుతున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో హిట్ కొట్టాలి అంటే యాక్షన్ చేయాల్సిందే అని దర్శకులు భావిస్తున్నారు. మరి రష్మిక మందన్న కోసం ఎవరైనా రొమాంటిక్ లవ్ స్టోరీని రెడీ చేస్తారేమో చూడాలి. ఆకట్టుకునే కథ మరియు కథనంతో మాంచి రొమాంటిక్ లవ్ స్టోరీని తెరకెక్కిస్తే కచ్చితంగా భారీ విజయాలను సొంతం చేసుకుంటాయి. కానీ ఫిల్మ్ మేకర్స్ మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. రష్మిక కోసం అయినా రొమాంటిక్ లవ్ స్టోరీని రెడీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయంను ఆమె అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పుష్ప 2 తో పాటు రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాలు తమిళంలో ధనుష్ సినిమాను చేస్తోంది. అంతే కాకుండా హిందీలో కూడా రాబోయే రోజుల్లో వరుసగా సినిమాలు చేయబోతుందట.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com